క్లుప్తంగా

చెత్త నుంచి సంపద సృష్టించండి



ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు

కరప: చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను సక్రమంగా నిర్వహించి, పంచాయతీల ఆదాయాన్ని పెంచేందుకు కృషిచేయాలని ఈఓ పీఆర్డీ ఎస్‌వీ శ్రీనివాసరావు సూచించారు. విజయరాయుడుపాలెంలో గురువారం ఆయన పర్యటించి, ఈ కేంద్రాన్ని పరిశీలించి పలు సూచనలు ఇచ్చారు. షెడ్ల నిర్వహణలో అలసత్వం వహించవద్దన్నారు. సేకరించిన చెత్త నుంచి వర్మీకంపోస్టు తయారుచేసి విక్రయించడం ద్వారా ఆదాయం సమకూర్చాలన్నారు. సర్పంచ్ వెలుగుబంటి సీతారామరాఘవ, కార్యదర్శి పి.వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

దరిద్రానికి మరో పేరు చంద్రబాబు

- వైఎస్సార్ సీపీ మహిళా నేత జమ్మలమడక నాగమణి

కాకినాడ రూరల్: దరిద్రానికి మరో పేరు చంద్రబాబు అని, ఆయన హయాంలో రాష్ట్రం కరువు కాటకాలతో నిత్య దరిద్రంగా ఉండేదని, అటువంటి వ్యక్తి నేడు దరిద్రమని మాట్లాడటం విడ్డూరంగా ఉందని వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జమ్మలమడక నాగమణి పేర్కొన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు జిల్లా పర్యటన సందర్భంగా ముఖ్యమంత్రి జగన్‌పై చేస్తున్న వ్యాఖ్యలను ఆమె గురువారం ఖండించారు. ఈ రాష్ట్రంలో ప్రజలు బాబును ఎందుకు నమ్మాలో చెప్పాలని ప్రశ్నించారు. పోలవరం, అమరావతి రాజధాని విషయంలో చేసిన మోసం ప్రజలు మరచిపోరన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి జగన్ ముందు చంద్రబాబు కచ్చితంగా దరిద్రుడేనన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి



గృహనిర్మాణాలపై సమీక్షిస్తున్న ఎంపీడీఓ స్వప్న, హౌసింగ్ ఏఈఈ శ్రీనివాస్

కరప: గ్రామాల్లో ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని ఎంపీడీఓ కర్రె స్వప్న సూచించారు. ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం ఆమె హౌసింగ్, గ్రామ సచివాలయాల ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశమై గృహ నిర్మాణాలపై సమీక్షించారు. గృహనిర్మాణాలు ప్రారంభించిన వారితో త్వరితగతిన పూర్తిచేయించాలన్నారు. నిర్దేశించిన లక్ష్యాలు పూర్తిచేయాలన్నారు. గృహ నిర్మాణాలకు అవసరమైన వసతులు కల్పించడమే కాకుండా, సిమెంట్, ఐరన్ సరఫరా చేస్తున్నామని, బిల్లులు సత్వరం చెల్లించడం జరుగుతుందని తెలియజేసి నిర్మాణాలు పూర్తిచేయించాలని సూచించారు. హౌసింగ్ ఏఈఈ శ్రీనివాస్, ఏఓ గుత్తుల భీమశంకరరావు, మండల ఇంజినీరింగ్ అధికారి శైలజ, ఈఓ పీఆర్డీ ఎస్‌వీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బోన్ కేన్సర్ చికిత్సలో అధునాతన విధానాలు

- అవగాహన కల్పించిన వైద్య నిపుణులు
- కాకినాడ బోన్ క్లబ్ ఆధ్వర్యంలో సీఎంఈ

కాకినాడ క్రైం: కాకినాడ ఆర్థోపెడిక్స్ అసోసియేషన్ (బోన్ క్లబ్) ఆధ్వర్యంలో కాకినాడ హోటల్ జీఆర్‌టీలో సీఎంఈ (కంటిన్యూయింగ్ మెడికల్ ఎడ్యుకేషన్) నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ బి.నారాయణరావు, కార్యదర్శి డాక్టర్ ఎస్.పురుషోత్తమరావు అధ్యక్షతన గురువారం జరిగిన ఈ సీఎంఈలో హైదరాబాద్ జూబ్లీహిల్స్ అపోలో వైద్య నిపుణుడు ఆర్థోపెడిక్ ఆంకోసర్జన్ డాక్టర్ రాజీవ్‌రెడ్డి, న్యూరోసర్జన్ డాక్టర్ బీజీ రత్నం అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. బోన్ కేన్సర్ చికిత్సలో అందుబాటులోకి వచ్చిన అధునాతన విధానాలపై డాక్టర్ రాజీవ్ మాట్లాడారు. తగిన వైద్య విధానాల ద్వారా రోగిని ప్రాణాపాయం నుంచి రక్షించవచ్చని తెలిపారు. డాక్టర్ బీఎస్ రత్నం మాట్లాడుతూ సర్వైకల్ డిస్క్ రీప్లేస్‌మెంట్‌లో భాగంగా శరీరంలో ఏ ఇతర భాగాన్నీ తొలగించకుండా, ప్రతికూల ప్రభావాలు పడకుండా శస్త్ర చికిత్స అందించే అధునాతన విధానాలను తోటి వైద్యులకు వివరించారు. ఈ సీఎంఈలో ప్రముఖ ఆర్థోపెడిక్ నిపుణులు డాక్టర్ వై.నాగేశ్వరరావు, డాక్టర్ పుల్లారావు, డాక్టర్ ఎస్ఎస్ మూర్తి, డాక్టర్ రమణారావుతో పాటు పలువురు ఆర్థోపెడిక్ వైద్యులు పాల్గొన్నారు.

పేకాట కేసులో 11 మంది అరెస్టు

కాకినాడ రూరల్: మండలంలోని పెనుమర్తి రోడ్డులోని మామిడితోటలో పేకాట ఆడుతున్నట్టు సమాచారం అందుకున్న తిమ్మాపురం పోలీసులు గురువారం రాత్రి దాడి చేశారు. ఎస్సై నాగార్జునరాజు, సిబ్బంది నిర్వహించిన దాడిలో 11 మంది పట్టుబడ్డారు. వీరి నుంచి సుమారు రూ.25,600 స్వాధీనం చేసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నారు.



చినమామిడాడలోని పంచముఖేశ్వరస్వామి



పెద్దాపురప్పాడులోని ఉమాపార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి



పెనుగుదురులోని బాలాత్రిపుర సుందరి సీతేశ్వరస్వామి



నేమాం పురాతన శివాలయంలో ఉమారామలింగేశ్వరస్వామి



నడకుదురు విఘ్నేశ్వరాలయంవద్ద చెరువు మధ్యలో శివుని విగ్రహం

జాగరణకు వేళాయె..

- శైవాలయాల్లో లింగోద్భవ దర్శనాలకు ఏర్పాట్లు పూర్తి చేసిన ఆలయ కమిటీలు
- ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ



శివరాత్రి వేడుకలను ప్రారంభిస్తున్న సిస్టర్ రజని, రాగిరెడ్డి చంద్రకళాదీప్తి తదితరులు



బ్రహ్మకుమారిల శాంతి ర్యాలీ

కరప: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని ఆయా ఆలయ కమిటీలు, దేవదాయ శాఖాధికారులు ఏర్పాట్లు చేశారు. కరప శివాలయానికి 300 ఏళ్ల చరిత్ర ఉంది. ఇక్కడ శివాలయంలోని పర్వత వర్ధినీదేవి సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలో ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఈఓ వడ్డాది సత్తిబాబు గురువారం తెలిపారు. శనివారం తెల్లవారు జాము నుంచి ఆదివారం సాయంత్రం వరకు పూజలు జరుగుతాయని ప్రధాన అర్చకులు విలపర్తి శ్రీనివాస్ తెలిపారు. భక్తుల జాగరణ కోసం సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్టు ఈఓ తెలిపారు. కూరాడ శివారు చినమామిడాడలోని పంచముఖేశ్వర ఆలయంలో వంశపారంపర్య ధర్మకర్త మెర్ల వీరయ్యచౌదరి, 500 ఏళ్ల చరిత్ర ఉన్న పెనుగుదురు బాలాత్రిపుర సుందరి సీతేశ్వరస్వామి ఆలయంలో ఆలయ ప్రధాన అర్చకులు భైరవభట్ల సుబ్రహ్మణ్యశర్మ, భైరవభట్ల సాయిరాం, పెద్దాపురప్పాడులోని ఉమాపార్వతీ సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలో అర్చకులు బాదంపూడి భాస్కరవెంకట సుబ్రహ్మణ్యం, ఆలయకమిటీ సభ్యులు, వేములవాడ భీమేశ్వరాలయంలో పాట్నీడి వంశీయులు, గ్రామ మాజీ సర్పంచ్, కరప డీసీ మాజీ చైర్మన్ బండే తాతాజీ, అరట్లకట్టలోని భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి ఆలయ అర్చకులు కొంతేటి సత్యనారాయణ, సూర్యదత్త శివకుమార్, వేళంగి బాలత్రిపుర సుందరీ సమేత భవానీ శంకరస్వామి, నడకుదురులోని బాలాత్రిపురసుందరి సమేత రామలింగేశ్వరస్వామి, గురజనాపల్లి, గొర్రిపూడి, వాకాడ తదితర గ్రామాల్లోని శివాలయాల్లో శివరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు చేశారు. నడకుదురు విఘ్నేశ్వరాలయం వద్ద చెరువులో శివపార్వతుల, శివలింగాకారంకు లైటింగ్ ఏర్పాటు చేసినట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

రేపు సత్కళావాహినిలో శివరాత్రి వేడుకలు

కాకినాడ కల్చరల్: స్థానిక ఎన్ఎఫ్‌సీఎల్ రోడ్డులోని సత్కళావాహిని భక్తిరస సంగీత సంస్థ ఆడిటోరియంలో శనివారం మహాశివరాత్రి వేడుకలు నిర్వహించనున్నట్టు సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి, సంగీత విద్వాంసుడు డాక్టర్ ఈవీ కృష్ణమాచార్యులు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి రాత్రి 12 గంటల వరకు వేడుకలు నిర్వహిస్తామని తెలిపారు. శివనామ, అన్నమాచార్య సంకీర్తనల పోటీలు, లలిత–విష్ణు సహస్రనామ పారాయణం, భక్తి, సినీ కీర్తనలు తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.

నేమాం శివాలయంలో..

కాకినాడ రూరల్: మండలంలోని సముద్రతీర గ్రామం నేమాంలోని పురాతన శివాలయం మహాశివరాత్రి వేడుకలకు సిద్ధమైంది. ఇక్కడ పర్వత వర్ధిని సమేత ఉమా రామలింగేశ్వరస్వామికి గురువారం రాత్రి కల్యాణం నిర్వహించారు. నేమాంతో పాటు సూర్యారావుపేట, తూరంగి, ఇంద్రపాలెం, సర్పవరం, రమణయ్యపేట ఆర్టీసీ కాలనీ, గోకుల్ గార్డెన్, కొవ్వూరు, తదితర గ్రామాలలో మహాశివరాత్రికి ఏర్పాట్లు చేశారు.

భక్తులకు మెరుగైన వసతులు

బోట్‌క్లబ్: మహాశివరాత్రి సందర్భంగా దేవాలయంవీధిలోని బాలాత్రిపుర సుందరి సమేత భీమేశ్వరస్వామి ఆలయంలో శనివారం తెల్లవారు జాము నుంచి భక్తులకు దర్శనం, అభిషేకాలు చేసుకొనే సదుపాయం కల్పిస్తున్నట్టు ఆలయ కమిటీ చైర్మన్ రాజనాల విజయసారథి గురువారం విలేకర్లకు తెలిపారు. ఈ సందర్భంగా అన్న సమారాధన నిర్వహిస్తున్నట్టు చెప్పారు. భక్తులు స్వామి వారికి దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

బ్రహ్మకుమారిల శాంతి ర్యాలీ

కాకినాడ రూరల్: మహా శివరాత్రి సందర్భంగా సర్పవరం జంక్షన్‌లో వేడుకలు నిర్వహిస్తున్న బ్రహ్మకుమారీలు గురువారం శాంతి ర్యాలీ నిర్వహించారు. బ్రహ్మకుమారి రజనీ ఆధ్వర్యంలో సర్పవరం జంక్షన్ నుంచి ఏపీఎస్పీ వరకు ర్యాలీ నిర్వహించారు. శివరాత్రి వేడుకలను సర్పవరం జంక్షన్‌లో ఏర్పాటు చేశారు. 25 అడుగు శివలింగంతో పాటు పలు స్టాళ్లను ఏర్పాటు చేసి భక్తులకు వివరిస్తున్నారు. ప్రారంభోత్సవంలో కొడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, మాజీ కార్పొరేటర్ బన్ను తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కాకినాడ సిటీ: సాంబమూర్తినగర్ పరిధిలోని 33/11కేవీ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ తీగల సరిచేయడం, ఇతర నిర్వహణ పనుల నిమిత్తం శుక్రవారం ఉదయం 8.30 గంటల నుంచి ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ ప్రసాద్ గురువారం సాయంత్రం తెలిపారు. డైరీఫారం సెంటర్, సాంబమూర్తినగర్, పల్లంరాజునగర్, దుమ్ములపేట, రెవెన్యూకాలనీ, అయోధ్యనగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు తెలిపారు.

నేడు తాగునీటి సరఫరాకు అంతరాయం

కాకినాడ సిటీ: నగరపాలక సంస్థ 32, 33వ డివిజన్ ఆనందభారతి సినిమా రోడ్డు విస్తరణలో పైప్‌లైన్ పాడవడం వల్ల ఆ స్థలంలో కొత్తగా వేసిన పైప్‌లైన్లు కలిపే పనుల వల్ల 17వ తేదీ శుక్రవారం సాయంత్రం తాగునీటి సరఫరా పూర్తిగా నిలిపివేస్తున్నట్టు నగరపాలక సంస్థ ఎస్ఈ సత్యకుమారి గురువారం తెలిపారు. అలాగే 36వ డివిజన్‌లో ప్రభుత్వ ఆసుపత్రి పైప్‌లైన్ 150 ఎంఎం స్లూయిస్ వాల్వ్ మార్పడం, మీటర్ మార్పుల వల్ల 6, 7, 30, 32, 33, 35, 36, 37, 38, 39, 40, 41 డివిజన్లకు సంబంధించి కాకినాడ కుళాయి చెరువు రిజర్వాయర్లు ఈ నెల 17న సాయంత్రం నీటి సరఫరా పూర్తిగా నిలిపివేస్తున్నట్లు వివరించారు. ఆయా వార్డుల ప్రజలు ముందుగానే నీరు నిల్వ చేసుకోవాలని ఎస్ఈ కోరారు. అత్యవసరమైతే తాగునీటి ట్యాంకర్ల సరఫరాకు 96767 70461, 98484 71415, 63013 87834 నంబర్లలో సంప్రదించాలన్నారు.

39 మందికి కంటి ఆపరేషన్లు



శస్త్ర చికిత్సలు చేయించుకున్న వారితో మాజీ డిప్యూటీ మేయర్ ఉదయ్‌కుమార్

కాకినాడ: స్థానిక జగన్నాథపురం ప్రాంతానికి చెందిన సుమారు 39 మందికి ఉచితంగా కంటి శస్త్ర చికిత్సలు చేశారు. మాజీ డిప్యూటీ మేయర్ మీసాల ఉదయ్‌కుమార్ ఆధ్వర్యంలో ఈ నెల 14న అన్నమ్మఘాటీ పాఠశాలలో వైద్య పరీక్షలు నిర్వహించగా 39 మందికి ఆపరేషన్లు అవసరమని నిర్ధారించారు. వీరందరికీ పిఠాపురంలోని సీఎంసీ కంటి ఆస్పత్రిలో విజయవంతంగా ఆపరేషన్లు చేయించినట్టు ఉదయ్‌కుమార్ చెప్పారు.

విపత్తుల నియంత్రణకు సంసిద్ధత అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ రమణ

- ఆర్డీఓ బీవీ రమణ
- కోరమాండల్‌లో ప్రత్యేక సమావేశం

కాకినాడ రూరల్: పరిశ్రమల్లో విపత్తులను ఎదుర్కొనేందుకు సంసిద్ధత అవసరమని ఆర్డీఓ బీవీ రమణ పేర్కొన్నారు. రాష్ట్ర విపత్తుల నివారణ విభాగం ఆధ్వర్యంలో ఈనెల 23న పారిశ్రామిక విపత్తులపై సంసిద్ధత, నష్ట నివారణపై నిర్వహించనున్న మాక్ డ్రిల్‌పై అవగాహన కోసం గురువారం వలసపాకలలోని కోరమాండల్ కర్మాగారంలో డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ రాధాకృష్ణ అధ్యక్షతన ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆర్డీఓ మాట్లాడుతూ వివిధ పరిశ్రమల్లో రసాయనాల వల్ల జరిగే ప్రమాదాలపై యాజమాన్యాలు, ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతి పరిశ్రమకు ఒక నోడల్ అధికారిని యంత్రాంగం, ప్రజలకు సమన్వయ కర్తగా నియమించాలన్నారు. డీఎస్పీ మురళీకృష్ణారెడ్డి, ఫ్యాక్టరీల ఇన్‌స్పెక్టర్ మురళీకృష్ణ, జిల్లా అగ్ని మాపక అధికారి యేసుబాబు, పండూరు పీహెచ్‌సీ వైద్యాధికారి మాధవి, సీఐ మురళీకృష్ణ, కోరమాండల్ యూనిట్ హెడ్ శ్రీనివాసరావు, హెచ్ఆర్ పద్మనాభం, కర్మాగార భద్రతా అధికారి పీసీ రావు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల భద్రతకు చర్యలు తీసుకోవాలి

- 18న రౌండ్ టేబుల్ సమావేశం
- కేంద్ర కార్మిక సంఘాల తీర్మానం



సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర కార్మిక సంఘాల నాయకులు

కాకినాడ సిటీ: పరిశ్రమల్లో కార్మికులకు భద్రత సౌకర్యాలు కల్పించాలని, ప్రమాదాల నివారణకు శాశ్వత ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని, కార్మికుల సంక్షేమాన్ని యాజమాన్యాలు అమలు చేయాలని కోరుతూ ఈనెల 18న ఎన్‌జీవో కార్యాలయంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు కేంద్ర కార్మిక సంఘాలు ప్రకటించాయి. గురువారం కచేరిపేట సీఐటీయూ కార్యాలయంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్ అధ్యక్షతన జరిగిన కేంద్ర కార్మిక సంఘాల సన్నాహక సమావేశంలో పలువురు వక్తలు నిర్ణయించారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల ప్రమాదాల సంఖ్య పెరిగి పదుల సంఖ్యలో కార్మికులు చనిపోతున్నారని, దీనికి కార్మికశాఖ అధికారులు, ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు జిల్లా అధికారులు బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. కనీస పర్యవేక్షణ చేయకుండా యాజమాన్యాలు ఇచ్చే లంచాలకు అలవాటు పడి కార్మికుల జీవితాలను యాజమాన్యాల దయా దాక్షిణ్యాలకు వదిలేశారని విమర్శించారు. తక్షణమే కలెక్టర్ కృతికా శుక్లా జోక్యం చేసుకొని పరిశ్రమల్లో భద్రతపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికుల భద్రత, కార్మిక చట్టాలను అమలు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన యాజమాన్యాలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. కార్మికుల శ్రేయస్సు కోరే మేధావి వర్గం, రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు పాల్గొని రౌండ్ టేబుల్ సమావేశాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సీఐటీయూ చెక్కల రాజ్‌కుమార్, జాతీయ ఉపాధ్యక్షురాలు జి.బేబీరాణి, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ తాళ్లూరు రాజు, ఆశా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రమళ్ల పద్మ, సీఐటీయూ నాయకులు పలివెల వీరబాబు, మలకా రమణ, కె.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

కోర్టులో ఏసీల కాపర్ వైర్ల చోరీ



కాపర్ వైర్లకు మరమ్మతులు చేస్తున్న ఎలక్ట్రీషియన్లు

కాకినాడ క్రైం: కాకినాడ కోర్టులో దొంగతనం జరగడం కలకలం రేపింది. కోర్టుల ప్రాంగణంలో పలు న్యాయస్థానాల్లో జడ్జిల రూంలను అనుసంధానం చేసి ఉన్న ఏసీల కాపర్ వైర్లను ఆగంతకులు కత్తిరించి ఎత్తుకెళ్లారు. నాలుగో అదనపు జిల్లా కోర్టు, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు, ఒకటవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు, మొబైల్ మెజిస్ట్రేట్ కోర్టుల ఏసీల కాపర్ వైర్లను దొంగలు ఎత్తికెళ్లినట్లు గుర్తించారు. ఈ నేపథ్యంలో జిల్లా కోర్టు సూపరింటెండెంట్ ఫిర్యాదు మేరకు కాకినాడ సీసీఎస్ పోలీసులు కేసు నమోదు చేశారు. వారం రోజుల వ్యవధిలో ఈ దొంగతనాలు చోటు చేసుకున్నట్లు భావిస్తున్నామని పోలీసులు తెలిపారు. కొద్ది రోజుల క్రితం బార్ అసోసియేషన్‌లో ఇదే తరహాలో కాపర్ వైర్ల దొంగతనం జరిగితే పోలీసులకు ఫిర్యాదు చేసిన స్పందించలేదని బార్ బృందం పేర్కొంది.

వృత్తి విద్య నైపుణ్యాలు పెంచుకోవాలి

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): వృత్తి విద్యార్థులు తమ నైపుణ్యాలు పెంపొందించుకోవాలని స్కిల్ డెవలప్‌మెంట్ రీజినల్ డైరెక్టర్ కె.శ్రీనివాసరావు పేర్కొన్నారు. జేఎన్‌టీయూకేలో గురువారం స్కిల్ డెవలప్‌మెంట్‌పై వర్క్‌షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు అప్రెంటీస్ విధానంలో కొత్తగా వచ్చిన మార్పులు వివరించారు. విద్యార్థులకు నైపుణ్యాలు లేకపోవడంతో వల్ల ఉద్యోగాలు సాధించలేకపోతున్నారని, దానికి గల కారణం తెలుసుకుని అందుకు తగ్గట్టుగా శిక్షణ ఇస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జేఎన్‌టీయూకే వీసీ డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు, ఆర్‌డీడీ నాగవర్ధనరాజు, ప్రిన్సిపాల్ వర్మ, వివిధ పరిశ్రమల ప్రతినిధులు, పాల్గొన్నారు.

శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యం



విద్యార్థుల నోట్ పుస్తకాలు పరిశీలిస్తున్న డీఈఓ అన్నపూర్ణ



విద్యార్థులకు ధైర్యం చెబుతున్న ఆదిలక్ష్మి

- డీఈఓ అన్నపూర్ణ
- ఏపీఎస్పీ జెడ్పీ ఉన్నత పాఠశాల తనిఖీ

కాకినాడ రూరల్: పదో తరగతిలో నూరు శాతం ఉత్తీర్ణత సాధించే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నట్టు డీఈఓ కేఎంవీ అన్నపూర్ణ పేర్కొన్నారు. రమణయ్యపేట ఏపీఎస్పీలోని జెడ్పీ ఉన్నత పాఠశాలను గురువారం సందర్శించి ఉపాధ్యాయులతో భేటీ అయ్యారు. పాఠశాలలో వసతులు, బోధన అంశాలపై ఎంఈఓ ఎల్.గణేష్‌బాబు, హెచ్ఎం పి.పుల్లయ్య వివరించారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సమీపిస్తున్నందున విద్యార్థులను తీర్చిదిద్దేలా ఉపాధ్యాయులను ఆదేశించామన్నారు. ప్రణాళిక ప్రకారం పాఠ్యాంశాల బోధన, రివిజన్ చేపట్టాలని కోరామన్నారు.

ఏపీఎస్పీ జెడ్పీ హైస్కూల్‌లో పరీక్షా పర్వ్–4.0

కాకినాడ రూరల్: పదో తరగతి విద్యార్థులు ఒత్తిడి లేకుండా పరీక్షలకు సిద్ధమవ్వాలని ఏపీ బాలల హక్కుల పరిరక్షణ సంస్థ సభ్యురాలు టి.ఆదిలక్ష్మి, బొమ్మూరు డైట్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ఆర్ సుబ్రహ్మణ్యం, లెక్చరర్ గంగాధరరావు పేర్కొన్నారు. రమణయ్యపేట ఏపీఎస్పీ జెడ్పీ ఉన్నత పాఠశాలను గురువారం వారు సందర్శించి పరీక్షా పర్వ్–4.0 కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులకు పరీక్షల భయం లేకుండా ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో హెచ్ఎం రాజు, పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ కడియాల రాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు



కరప బోదెలోని సాగునీటి పరిమాణాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీనివాసరావు

కరప: మండల పరిధిలోని గ్రామాల్లో రబీలో సాగునీటికి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నట్టు తహసీల్దార్ పి.శ్రీనివాసరావు తెలిపారు. ఎంపీఓ ఏవీ రాజేష్, కొవ్వూరు, జగన్నాథగిరి ఇరిగేషన్ సెక్షన్ ఏఈఈలు బీవీవీ సుబ్రహ్మణ్యం, జీఎస్ ప్రవీణ్‌యాదవ్, వీఆర్వోలు, వీఏఏలతో కలసి ఆయన కరప బోదె, కొంగోడు లిఫ్ట్ ఇరిగేషన్, తుల్యభాగ డ్రెయిన్, న్యూ భీమన్నకర్ర కాలువ, పెద్దాపురప్పాడు, చిన మామిమాడ గ్రామాల్లోని పంటకాలువలను పరిశీలించి, సాగునీటి సరఫరాను పరిశీలించారు. తహసీల్దార్ మాట్లాడుతూ ఎమ్మెల్యే కన్నబాబు సూచనల మేరకు సాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. వంతులవారీ విధానం అమలు చేస్తున్నామన్నారు. అవసరమైన చోట్ల డ్రైన్లలో అడ్డుకట్టలు వేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. వంతులో తడుపుకొన్నవారు వాళ్లవంతు వచ్చే వరకు తడుపుకోకుండా, చేపల చెరువుల వారు పంటకాలువల నుంచి తోడుకోకుండా ఎప్పటికప్పుడు మండల, గ్రామ కమిటీలు పర్యవేక్షించి, రైతులు ఇబ్బంది లేకుండా సాగునీరు అందించడం జరుగుతుందన్నారు. తనతో పాటు ఎంపీఓ, ఇరిగేషన్ అధికారులు, కరప ఎస్ఐ ఎస్.రామకృష్ణ మండల కమిటీగా, వీఏఏ, వీఆర్వో, మహిళాపోలీసు, లస్కర్‌లు గ్రామకమిటీగా సాగునీటి సరఫరాను పర్యవేక్షించడం జరుగుతుందని తహసీల్దార్ శ్రీనివాసరావు తెలిపారు.

పాదగయలో శివరాత్రి ఉత్సవాలు ప్రారంభం



పాదగయ క్షేత్రంలో పసుపు వాయ వేస్తున్న మహిళలు

పిఠాపురం: స్థానిక పాదగయ క్షేత్రంలో మహాశివరాత్రి మహోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. పండితులు ఉదయం ఆలయ ప్రాంగణంలో ధ్వజారోహణం, అంకురార్పణతో ఉత్సవాలను ఘనంగా ప్రారంభించారు. రాత్రి స్వామివారి కల్యాణోత్సవంలో మహిళలు పసుపు దంచారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేసి స్వామివారిని పెండ్లి కుమారుడు, అమ్మవారిని పెండ్లి కుమార్తెలను చేశారు. వేలాది మంది భక్తుల నడుమ రాత్రికి స్వామివారి కల్యాణం కనుల పండువగా జరిగింది. ఈ నెల 21 వరకూ నిర్వహించే మహాశివరాత్రి ఉత్సవాల్లో భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నట్లు ఆలయ ఈఓ ఆర్.సౌజన్య తెలిపారు. ఎమ్మెల్యే పెండెం దొరబాబు స్వామి వారికి కల్యాణ వస్త్రాలు సమర్పించారు.

భీమేశ్వర కల్యాణోత్సవాలు ప్రారంభం

సామర్లకోట: స్థానిక బాలాత్రిపుర సుందరి సమేత కుమార రామభీమేశ్వర స్వామి ఆలయంలో గురువారం స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవాలు భక్తి శ్రద్ధ లతో ప్రారంభమయ్యాయి. రాత్రి స్వామి వారికి కల్యాణం జరిగింది. ఉదయం అభిషేకాలు, అమ్మవారికి ప్రత్యేక పూజలు, పట్టువస్త్రాలు బంగారు కిరీటంతో అలంకరణలు చేశారు. ఆలయంలో గురువారం నుంచి 21వ తేదీ వరకు ఉత్సవాలు జరుగుతాయి. 18న మహాశివరాత్రి సందర్భంగా ప్రత్యేక దర్శనాలకు ఆలయ అధికారులు జోరుగా ఏర్పాట్లు పూర్తి చేశారు. 19న రథోత్సవం, 21న స్వామి వారి శ్రీపుష్పయాగోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయి. భక్త సంఘం నాయకుడు బిక్కిన సాయి స్వామి, అమ్మవార్లకు పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈఓ డి.నాగమల్లేశ్వరరావు ఆధ్వర్యంలో సన్నిధిరాజు అంజిబాబు దీక్షాధారణ చేపట్టారు.

భక్తుల చెంతకు స్వామి, అమ్మవార్లు..

కల్యాణోత్సవాల్లో భాగంగా మధ్యాహ్నం నంది వాహనంపై ఈఓ డి నాగమల్లేశ్వరరావు గ్రామోత్సవాన్ని ప్రారంభించారు. ఆలయం నుంచి రైల్వే గేటు మీదుగా గాంధీచౌక్ నుంచి చిన్నవీధి, పెద్ద వీధి, యార్లగడ్డ వారి వీధి, కొత్తూరు, అయోధ్యరామపురం, దేవీచౌక్ మీదుగా స్వామి వారి గ్రామోత్సవం ఆలయానికి చేరింది. అనంతరం రాత్రి కల్యాణం జరిపించారు.